

నేడు రాష్ట్ర ప్రధాన ఎన్నికల అధికారి భీమవరం రాక

ప్రజాశక్తి - భీమవరం టౌన్

రాష్ట్ర ప్రధాన ఎన్నికల అధికారి ముఖేష్ కుమార్ మీనా గురువారం భీమవరం రానున్నట్లు జిల్లా కలెక్టర్, జిల్లా ఎన్నికల అధికారి సుమిత్ కుమార్ బుధవారం ఒక ప్రకటనలో తెలిపారు. గురువారం మధ్యాహ్నం 2 గంటలకు కృష్ణాజిల్లా మచిలీపట్నం నుంచి బయలుదేరి మధ్యాహ్నం 3.30కు భీమవరం చేరుకుంటారు. మధ్యాహ్నం 3.30 నుంచి 4.30 వరకూ భీమవరం ఎస్ఆర్‌కెఆర్ ఇంజనీరింగ్ కాలేజీ, విష్ణు కాలేజీలలో ఏర్పాటు చేసిన కౌంటింగ్ కేంద్రాలను, స్ట్రాంగ్ రూమ్‌లను తనిఖీ చేస్తారు. సాయంత్రం 4.30కు భీమవరం నుంచి బయలుదేరి విజయవాడ వెళ్తారని తెలిపారు.

తూడు, గుర్రపుడెక్క తొలగించేదెన్నడో..!

శివారు ప్రాంత భూములకు అందని సాగునీరు
కాలువల అభివృద్ధి నిల్
అధికారులు పనులు చేపట్టాలని కోరుతున్న రైతులు



తాడేరు డ్రెయిన్‌లో పేరుకుపోయిన గుర్రపుడెక్క

ప్రజాశక్తి - ఆచంట

సాగు, మురుగునీటి పారుదల వ్యవస్థ సక్రమంగా ఉన్న ఆయుకట్టులోనే పంటలు బాగా పండుతాయి. వ్యవసాయానికి ప్రధాన ఆధారమైన నీరు పూర్తిస్థాయిలో సరఫరా అయితే సాగు ఖర్చులు తగ్గి రైతులు అధిక దిగుబడులు సాధిస్తారనడంలో ఎటువంటి సందేహమూ లేదు. ప్రధానంగా డెల్టా ప్రాంతంలో సాగు, తాగునీటి అవసరాలు తీర్చేది కాలువల నీరే. కొన్నాళ్లుగా ప్రధానంగా సాగులో కర్షకులను నీటి కష్టాలు వెంటాడుతున్నాయి. దీనికి ప్రధాన కారణం కాలువల్లో తూడు, గుర్రపుడెక్క పెరిగిపోవడమే. జూన్ 1న కాలువలకు నీరు విడుదల చేయనున్నట్లు అధికారులు ప్రకటించారు. మరో పక్క నైరుతి రుతుపవనాలు సైతం జూన్ మొదటి వారంలోనే విస్తరించనున్నట్లు వాతావరణ శాఖ చెబుతోంది. ఈ నేపథ్యంలో సాగుకు రైతులు సన్నద్ధమౌతున్నా శివారు భూములకు నీరందేనా అని రైతులు ఆందోళన చెందుతున్నారు.

నిబంధనలు..

తూడు, గుర్రపుడెక్క తొలగింపు పనులు ఉపాధి హామీ నిధులతో చేపట్టడానికి అవకాశం ఉంది. అయితే నిబంధనలు ప్రతి బంధకాలుగా మారాయి. ప్రధానంగా డెల్టా ప్రాంతంలో సాగుదారులకు ఎక్కువగా ఉపయోగపడే పంట కాలువలు, పంట బోదెలు, మురుగు కాలువలు, మురుగు డ్రెయిన్లు ఒక గ్రామం పరిధిలో సుమారు 15 నుంచి 30 కిలోమీటర్ల పొడవునా ఉన్నాయి. ఉపాధి హామీ చట్టంలో గ్రామీణ ప్రాంత రైతులకు ఎక్కువగా అవసరమైన సమయంలో కంటే కూడా అవసరంలేని సమయంలోనే జల వనరులను శుభ్రం చేసే పనులు చేపడుతున్నారు. ఒక గ్రామంలో ఏడాదికి కేవలం 10 కిలో మీటర్ల పరిధిలో మాత్రమే కాలువల్లో గుర్రపుడెక్క తొలగించాలనే నిబంధన ఉంది. దీంతో అన్ని పంట కాలువలను పూర్తిస్థాయిలో శుభ్రం చేయలేకపోతున్నారు. ఈ తరహాలో చేసిన కొద్దిపాటి పనులు రైతులకు ఉపయోగకరంగా ఉండడం లేదు.



ఆచంట తాడేరు డ్రెయిన్‌లో యంత్రాలతో గుర్రపుడెక్క తొలగిస్తున్న రైతులు (ఫైల్‌ఫోటో)

వేసవిలోనైనా తొలగించాలంటున్న రైతులు..

రబీకి ముందు పంట కాలువల్లో గుర్రపుడెక్క నివారణకు అధికారులు చర్యలు చేపట్టకపోవడంతో ప్రస్తుతం దాదాపు అన్ని కాలువల్లో దట్టంగా పెరిగిపోయింది. దీంతో పలు కాలువల పరిధిలో నీరు కిందకు వెళ్లక రైతులు పలుచోట్ల సాగునీటి ఎద్దడిని ఎదుర్కొంటున్నారు. మండలంలోని కోడేరు, పెదమల్లం, కరుగోరు మిల్లి, పెనుమంచిలి ప్రాంతాల్లో చిన్నపాటి పంట కాలువల్లో సైతం గుర్రపు డెక్క బాగా పెరిగిపోయింది. తాడేరు డ్రెయిన్‌లో కొడమంచిలి నుంచి పెనుమంచిలి వరకు గుర్రపుడెక్క, చెత్తాచెదారం పేరుకుపోయింది. కందరవల్లి నుంచి వల్లూరు వరకు టన్నుల కొద్దీ గుర్రపుడెక్క పెరిగిపోయింది. గత సార్వాలో డ్రెయిన్లు పూడుకుపోవడంతో రైతులు అష్టకష్టాలు పడి యంత్రాలతో పేరుకుపోయిన గుర్రపుడెక్కను స్వచ్ఛందంగా తొలగించుకున్నారు. పంట భూములకు సాగునీరందించే పంట కాలువలు ఎంత ముఖ్యమో మురుగునీరు బయటకెళ్లే డ్రెయిన్లు అంతే ముఖ్యం. ఏళ్ల తరబడి ఈ డ్రెయిన్ల అభివృద్ధికి నోచుకోకపోవడంతో ఏటా వరద సమయంలో పంట పొలాలకు ముప్పు తప్పడం లేదు. డ్రెయిన్ల అభివృద్ధి పనులు చేపట్టే కాంట్రాక్టర్లకు బిల్లులు చెల్లించకపోవడంతో సమస్య ఏర్పడుతోంది. ఈ నేపథ్యంలో డ్రెయిన్లలో దట్టంగా తూడు, గుర్రపుడెక్క పేరుకుపోవడంతో రైతులు ఆందోళన చెందుతున్నారు. తూడు, గుర్రపుడెక్క ఇలాగే ఉంటే అధిక వర్షాలు కురిసినప్పుడు పంట చేలకు ముంపు సమస్య తప్పదని పలువురు రైతులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. గుర్రపుడెక్క వల్ల వర్షపునీరు బయటకు లాగకపోవడంతో పంట చేలు ముంపునకు గురవుతున్నాయని వాపోతున్నారు. ఈ వేసవిలోనైనా పూర్తిస్థాయిలో గుర్రపు డెక్క నివారణకు అధికారులు చర్యలు చేపట్టాలని రైతులు కోరుతున్నారు.

ఈ వేసవిలో అభివృద్ధి లేనట్టేనా...

డ్రెయిన్ల అభివృద్ధి పనులకు కాంట్రాక్టర్లు ముందుకు రాకపోవడంతో, మరలా టెండర్లు పిలవడానికి ఎన్నికల కోడ్ అడ్డు రావడంతో ఈ ఏడాది వేసవిలో డ్రెయిన్ల అభివృద్ధి లేనట్టేనా అనే సందేహం రైతులకు కలుగుతోంది. ప్రభుత్వాల చిత్తశుద్ధి ఉంటే మురుగు డ్రెయిన్లను ఎప్పుడో బాగు చేయించి ఉండేదని అన్నదాతలు అంటున్నారు. ఏటా సార్వా సమయంలో భారీ వర్షాలు పడినప్పుడు వరదనీరు డ్రెయిన్ల ద్వారా కిందకు లాగకపోవడంతో సమస్య ఏర్పడుతోంది. పొలాల్లో రోజుల తరబడి నీరు నిలవడంతో పంట నష్టం తప్పడం లేదని అన్నదాతలు వాపోతున్నారు. ముఖ్యంగా మండలంలోని డ్రెయిన్లను ఆనుకుని ఉన్న పొలాలు తీవ్రంగా దెబ్బతింటున్నాయి, పంట చేతికొచ్చే సమయంలో రైతులు ఆర్థికంగా మరింత అప్పుల పాలై పెట్టుబడులు రాక వ్యవసాయం చేయలేం, మానేయాలనే ఆలోచనలతో సతమతమవుతున్నారు. ఇప్పటికైనా అధికారులు స్పందించి పంట, మురుగు కాలువల్లో పేరుకుపోయిన చెత్తాచెదారాన్ని తొలగించాలని రైతులు ముక్తకంఠంతో కోరుతున్నారు.

మురుగునీరు కిందకు పోయే దారి లేదు..



యల్లమెల్లి శోభన్‌బాబు, కౌలు రైతు, కొడమంచిలి

డ్రెయిన్లు బాగుచేసి రైతులకు ఇబ్బంది లేకుండా చూడాలి. లేదంటే వర్షాకాలంలో పంటలకు ముంపు తప్పదు. డ్రెయిన్లలో తూడు, గుర్రపుడెక్క పెరిగిపోవడంతో పొలాల్లో నీరు కిందకులాగే పరిస్థితి లేదు. డ్రెయిన్లు చెత్తాచెదారంతో బక్కచిక్కి పోవడంతో వెడల్పు తగ్గిపోయి నీరు సక్రమంగా కిందకు వెళ్లక పంట పొలాలు ముంపున గురవుతున్నాయి. ఇప్పటికైనా అధికారులు స్పందించి డ్రెయిన్లను అభివృద్ధి చేయాలి.

తూడు తొలగించాలి..



జక్కంశెట్టి సుబ్బారావు, కొడమంచిలి, కౌలు రైతు

పంట, మురుగు డ్రెయిన్లలో తూడు, గుర్రపుడెక్క పెరిగిపోవడంతో వంతుల వారీ సమయంలో శివారు ప్రాంత భూములకు సాగునీరు అందడం లేదు. దీంతో సాగునీటికి అనేక ఇబ్బందులు పడుతున్నాం. సార్వా సాగు సమయంలో గుర్రపుడెక్క వల్ల పంట పొలాల్లో నీరు బయటకెళ్లే మార్గం లేక ఏటా ముంపుతో దిగుబడి కోల్పోతున్నాం. అధికారులు స్పందించి ఈ వేసవిలోనైనా పూర్తిస్థాయిలో గుర్రపుడెక్క నివారణకు చర్యలు చేపట్టాలి.

వివాద స్థలంలో అంబేద్కర్ విగ్రహం

మాజీ సైనికోద్యోగి, దళితుల మధ్య ఘర్షణ

ప్రజాశక్తి - తాడేపల్లిగూడెం రురల్

పోలీసులపై రాళ్ల దాడి చేసిన వారిపై నాన్ బెల్ బుల్ కేసు నమోదు చేశామని డిఎస్‌పి మూర్తి తెలిపారు. బుధవారం నిర్వహించిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. పెంటపాడు మండలంలోని రవిపడు గ్రామంలో ఆర్మీ ఉద్యోగి సుబేదార్ మేజర్ పలివేల నాగేశ్వరరావుకు ఈ ఏడాది మార్చిలో నివాస స్థలం కింద 3 సెంట్ల భూమిని కలెక్టర్ కేటాయించారు. దీంతో వారు ఆ భూమిలో ఇంటిని నిర్మిస్తున్నారు. అయితే ఈ నెల 28న అదే ప్రాంతానికి చెందిన కొంత మంది ఎస్‌సి సామాజిక తరగతికి చెందిన వారు ఇంటి నిర్మాణ స్థలంలో అంబేద్కర్ విగ్రహాన్ని ఏర్పాటు చేశారు. దీంతో దళితులకు జవాన్ కుటుంబ సభ్యుల మధ్య మంగళవారం రాత్రి ఏడు గంటల మధ్య ఘర్షణ వచ్చింది. జవాన్ భార్యను దళితులు కొట్టినట్లు డిఎస్‌పి తెలిపారు. విషయం తెలుసుకున్న ఆర్‌డిఒ చెన్నయ్య, డిఎస్‌పి, తహశీల్దార్ రమేష్, సిఐ రమేష్ సంఘటనా స్థలానికి చేరుకుని ఇరువర్గాల పెద్దలతో చర్చించి వివాదాన్ని సద్దు చేసే ప్రయత్నం చేసినా ఫలితం లేకుండా పోయింది. బలవంతంగా అంబేద్కర్ విగ్రహాన్ని ప్రత్యేక స్థలంలో భద్రపర్చామన్నారు. ప్రస్తుతం అక్కడ ఎలాంటి నిర్మాణాలకూ అనుమతి లేదని డిఎస్‌పి తెలిపారు. ఈ నేపథ్యంలో పోలీసులపై దళితులు రాళ్లదాడి చేశారన్నారు. ఈ దాడిలో నలుగురు పోలీసు అధికారులకు గాయలయ్యాయని, వారంతా ప్రభుత్వాసుపత్రిలో చికిత్స పొందుతున్నారని తెలిపారు. ప్రస్తుతం వారి పరిస్థితి బాగానే ఉందని తెలిపారు. సాక్ష్యాలు సేకరిస్తున్నామని, విధులకు ఆటంకం కలిగించిన వారిపై కేసులు నమోదు చేసి చట్టపరమైన చర్యలు తీసుకుంటామన్నారు. ప్రస్తుతం 144 సెక్షన్ అమల్లో ఉందని తెలిపారు.



సైనికుని కుటుంబ సభ్యులతో మాట్లాడుతున్న పోలీసులు

మేజర్ సుబేదార్ భార్య ఆత్మహత్యాయత్నం

పోలీసులు భవన నిర్మాణాన్ని నిలుపుదల చేయాలని లేదంటే తామే 24 గంటల్లో కూల్చి వేస్తామని నోటీసులు ఇచ్చారు. దీంతో తమకు ప్రభుత్వమే పొజిషన్ చూపించి దళితులు అంబేద్కర్ విగ్రహంతో రాజకీయం చేస్తే దానికి తమ ఆస్తులు ఎలా ధ్వంసం చేస్తారంటూ సుబేదార్ భార్య విజయలక్ష్మి బుధవారం పెట్రోల్ పోసుకుని ప్రయత్నం చేశారు. దీంతో స్థానిక పోలీసులు, ఇరుగు పొరుగువారు ఆమెను నియంత్రించి ఆత్మహత్యాయత్నాన్ని అడ్డుకున్నారు. తమకు ప్రభుత్వమే న్యాయం చేయాలని 30 ఏళ్ల పాటు దేశ రక్షణలో సేవలందించిన ఒక సైనికునికి ప్రభుత్వం ఇచ్చే సత్కారం ఇదా అంటూ పలివెల నాగేశ్వరరావు ఆవేదన వ్యక్తం చేశారు. తమకు న్యాయం జరిగే వరకూ ఇంటి నిర్మాణం జోలికి ఎవరినీ వెళ్లనువ్వమని సైనిక ఉద్యోగి నాగేశ్వరరావు భార్య విజయలక్ష్మి డిమాండ్ చేశారు.

శాంతి భద్రతలకు విఘాతం ఉపేక్షించం

రావిపాడు ఘటనపై కలెక్టర్‌ను కలిసిన సైనిక ఉద్యోగి కుటుంబం
న్యాయం చేస్తాం
జిల్లా కలెక్టర్ సుమిత్ కుమార్



ప్రజాశక్తి - భీమవరం టౌన్

జిల్లాలో శాంతిభద్రతలకు విఘాతం కలిగించే వ్యక్తులను ఎట్టి పరిస్థితుల్లో ఉపేక్షించేది లేదని, కఠిన చర్యలు ఉంటాయని జిల్లా కలెక్టర్ సుమిత్ కుమార్ హెచ్చరించారు. ఒక సైనిక ఉద్యోగికి పెంటపాడు మండలం రావిపాడులో కేటాయించిన స్థలంలో నిర్మాణంపై చెలరేగిన వివాదాన్ని ఎప్పటికప్పుడు జిల్లా కలెక్టర్ సుమిత్‌కుమార్, జిల్లా ఎస్‌పి అజిత వెజెండ్ల సమీక్షించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడారు. ఈ సంవత్సరం మార్చిలో ఒక సైనిక ఉద్యోగికి రావిపాడులో మూడు సెంట్ల భూమిని కేటాయించడం జరిగిందని, ఆ స్థలంలో ఇంటి నిర్మాణం చేపట్టగా, రెవెన్యూ వర్గాలు ఇంటి నిర్మాణాన్ని నిలుపుదల చేయాలని, మీకు కేటాయించిన స్థలం వేరే సర్వే నంబర్‌లో ఉందని, ప్రస్తుతం నిర్మాణాన్ని నిలుపుదల చేయాలని కోరారని తెలిపారు. ఈ స్థలంలో నిర్మాణ విషయమై ఆ గ్రామంలోని ఒక సామాజిక తరగతికి చెందిన కొంతమంది కమ్యూనిటీ హాలుకు కేటాయించడం జరిగిందని, దీనిలో నిర్మాణం చేయొద్దని అభ్యంతరం తెలిపారని తెలిపారు. కొద్ది రోజులు నిర్మాణాన్ని నిలుపుదల చేసిన కుటుంబ సభ్యులు, మరలా మే 28న నిర్మాణాన్ని ప్రారంభించడంతో ఆ సామాజిక తరగతికి చెందిన వారు అంబేద్కర్ విగ్రహాన్ని ఇంటి నిర్మాణంలో ఉన్న పునాదులపై ఏర్పాటు చేయడంతో పాటు, సైనిక ఉద్యోగి భార్యపై దాడి చేయడంతో వివాదం చెలరేగిందన్నారు. తాడేపల్లిగూడెం ఆర్‌డిఒ, స్థానిక డిఎస్‌పి, పెంటపాడు తహశీల్దార్ స్థానిక పెద్దల సమక్షంలో ఇరువర్గాలకు నచ్చజెప్పడంతో వారు అంగీకరించారని తెలిపారు. సదరు స్థలం నుండి అంబేద్కర్ విగ్రహాన్ని తరలించిన సందర్భంలో ఆ సామాజికి తరగతికి చెందిన కొంతమంది పోలీసులపై రాళ్లను రువ్వడంతో డిఎస్‌పి, కొంతమంది పోలీసులకు దెబ్బలు తగిలాయన్నారు. రెవెన్యూ అధికారుల ఆదేశాలు పాటించకుండా నిర్మాణం నిలుపుదల చేయనందుకు సైనిక అధికారి భార్యపై, పోలీసులపై దాడి చేసినందుకు సదరు వ్యక్తులపై కేసులు నమోదు చేసినట్లు తెలిపారు. రావిపాడులో ప్రస్తుతం 144 సెక్షన్ అమల్లో ఉందని, ఎవరైనా ఉద్రిక్తతలకు దారి తీసేలా ప్రవర్తిస్తే చర్యలు కఠినంగా ఉంటాయి హెచ్చరించారు. సైనిక ఉద్యోగికి కేటాయించిన స్థలాన్ని త్వరలో అప్పగిస్తామని, అలాగే అంబేద్కర్ విగ్రహాన్ని అనువైన ప్రదేశంలో ఏర్పాటుకు స్థల పరిశీలనకు చర్యలు తీసుకుంటామని తెలిపారు. ఉద్రిక్తతలను ప్రేరేపించేలా సోషల్ మీడియాలో పోస్టులు పెట్టడం, కథనాలను ప్రసారం చేయడం, రాయడం వంటి చర్యలు తీవ్రంగా పరిగణించబడతాయన్నారు. వీటిపై విచారణ చేసి చర్యలు తీసుకుంటామన్నారు.

ఘటనకు అధికారుల జాప్యమే కారణం: కెవిపిఎస్

భీమవరం టౌన్: పెంటపాడు మండలం రావిపాడు గ్రామంలో దళిత పేటలో స్థల వివాదం ఘటన కేవలం అధికారుల జాప్యం వల్లనే జరిగిందని కెవిపిఎస్ జిల్లా ప్రధాన కార్యదర్శి కె.క్రాంతిబాబు ఆరోపించారు. బుధవారం భీమవరంలో కెవిపిఎస్ జిల్లా కార్యాలయంలో విలేఖర్ల సమావేశంలో ఆయన మాట్లాడుతూ రావిపాడు గ్రామంలో దళిత పేటకు ఆనుకొని ఉన్న ఇరిగేషన్ భూమిని సుమారు 40 ఏళ్లుగా దళిత ప్రజలు ఉపయోగించుకుంటున్నారన్నారు. అదే గ్రామానికి చెందిన సైనికాధికారి పలివెల నాగేశ్వరరావుకు ఇటీవల కాలంలో అధికారులు అదే స్థలంలో 3 సెంట్లు ఇంటి స్థలం కేటాయించారని చెబుతూ ఇల్లు నిర్మించడం వల్ల వివాదం తలెత్తిందని తెలిపారు. సైనిక కుటుంబానికి న్యాయం చేసి, ఏళ్ల తరబడి దళితులు ఉపయోగించుకుంటున్న ఆ స్థలాన్ని వారికి యధావిధిగా ఇవ్వాలని అన్నారు. ఈ ఘటనను తక్షణం సామరస్యంగా పరిష్కరించాలని క్రాంతిబాబు విజ్ఞప్తి చేశారు.

ఉన్నతాధికారి వికృత చేష్టలు..!

కలెక్టరేట్‌లో దారుణం
కిందస్థాయి సిబ్బందితో మూత్రం పారవేయిస్తున్న అధికారి

ప్రజాశక్తి - భీమవరం టౌన్

ఆయన ఓ ఉన్నతస్థాయి అధికారి.. క్షేత్రస్థాయి ఉద్యోగులకు ఆదర్శవంతంగా ఉండాల్సింది పోయి సభ్య సమాజం తలదించుకునే రీతిలో తన కింద స్థాయి సిబ్బందిచే వ్యక్తిగత పనులు చేయించుకుంటున్నారు. కుటుంబ సభ్యులే కాస్త ఆలోచించే చేసే పనులను సిబ్బందితో చేయించడం నేడు చర్చనీయాంశంగా మారింది. ఏకంగా తన మూత్రాన్ని బాటిల్లో పట్టి కార్యాలయ సిబ్బందితో బయట పడేస్తున్న ఘటన సాక్షాత్తూ కలెక్టరేట్ సాక్షిగా సాగుతోంది. ఇష్టం లేకున్నా ఆ అధికారితో ఎటువంటి కష్టం వస్తుందోనో భయంతో ఇబ్బంది పడుతూనే ఈ పని చేస్తున్నారు. జిల్లా కలెక్టరేట్లో కొందరు ఉన్నతాధికారుల తీరు పలు విమర్శలకు తావిస్తోంది. సుమారు ఆయన 400 గ్రామాలకు ఉన్నతాధికారిగా వ్యవహరిస్తున్నారు. ఆయన కింద ఎంతోమంది ఉద్యోగులు, సిబ్బంది పనిచేస్తున్నారు. నిత్యం తాను ఆఫీసుకు వచ్చింది మొదలు వెళ్లేలోగా ఎన్నిసార్లు మూత్రం వచ్చినా తన కార్యాలయంలో ఒక బాటిల్లో పట్టి సిబ్బందికి ఇచ్చి ఆ బాటిల్‌లో మూత్రాన్ని బయట పారబోయిస్తున్నాడు. ఇది చూసిన దిగువస్థాయి అధికారులు కూడా ఇదేం పని అని, అసలు ఆ అధికారికి సిబ్బంది మనుషులుగా కనిపించట్లేదా అని ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. అధికారి చేష్టలను ప్రశ్నిస్తే ఏం జరుగుతుందో అని తమ ఆత్మాభిమానాన్ని చంపుకుని చేసేది లేక అధికారి ఆదేశాల మేరకు ఆ మూత్రం బాటిల్‌ను బయటపారేస్తున్నారు. ఇదంతా ఏ మారుమూల గ్రామంలో ఏ అధికారో చేసి ఉంటే పరిస్థితి వేరేలా ఉండేది. ఏ పై అధికారులకు ఫిర్యాదు చేసినా తమకు వచ్చిన కష్టాన్ని చెప్పుకొని గట్టెక్కేవారు. ఇక్కడ ఆయనే ఆ శాఖకు ప్రధానాధికారి కావడంతో తమ బాధను ఎవరికి చెప్పుకోలేక కార్యాలయంలో సిబ్బంది ఇబ్బంది పడుతున్నారు. అయితే కాంపౌండ్‌లో సహచర ఉద్యోగులు వీరి బాధను చూసి ముక్కున వేలేసుకుంటున్నారు.

నేటి నుంచి జాతీయ స్థాయి నాటక పోటీలు

సినీ నిర్మాత తుమ్మలపల్లికి ఆత్మీయ చైతన్య పురస్కారం

ప్రజాశక్తి - భీమవరం టౌన్

భీమవరం డిఎన్ఆర్ ఇంగ్లీష్ మీడియం హైస్కూల్లో ఈ నెల 30వ తేదీ నుంచి జరగనున్న చైతన్య భారతి 17వ జాతీయ స్థాయి నాటక పోటీలకు ఏర్పాట్లు పూర్తయ్యాయని చైతన్య భారతి నాటక పరిషత్ అధ్యక్షులు రాయప్రోలు భగవాన్ తెలిపారు. డిఎన్ఆర్ ఇంగ్లీష్ మీడియం హైస్కూల్లో ప్రత్యేక కళావేదిక ఏర్పాట్లు పూర్తయ్యాయని, 30న డిఎన్ఆర్ కళాశాల అధ్యక్షులు గోకరాజు వెంకట నరసింహరాజు, కార్యదర్శి గాదిరాజు సత్యనారాయణ రాజు, మాజీ ఎంఎల్ఎ అల్లు సత్యనారాయణ, పంతం వేణుగోపాలకృష్ణ నెహ్రూ జాతీయ స్థాయి నాటక పోటీలను ప్రారంభిస్తారని తెలిపారు. దీనిలో భాగంగా 30న సినీ నిర్మాత తుమ్మలపల్లి రామ సత్యనారాయణకు ఆత్మీయ చైతన్య పురస్కారం, రంగస్థల నటులు, నాటక రచయిత పురాణం వెంకట రామ్ కుమార్‌కు జవ్వాది రంగస్థల చైతన్య పురస్కారం, రంగస్థల నటులు దర్శకులు జనాబ్ ఎస్ఎం భాషాకు మైనంపాటి రంగనాయకులు రంగస్థల చైతన్య పురస్కారాలతో సత్కరిస్తామని అన్నారు. అనంతరం గోవాడ క్రియేషన్స్ హైదరాబాద్ వారి 'మూల్యం' నాటక ప్రదర్శన జరుగుతుందని తెలిపారు. ముందుగా కళావేదికను చైతన్య భారతి సభ్యులు రాయప్రోలు శ్రీనివాసమూర్తి, భట్టిప్రోలు శ్రీనివాసరావు (బిఎస్ఆర్) పేరిచర్ల లక్ష్మణ వర్మ, కట్రేడ్డి సత్యనారాయణ, అప్పారావు, భాషా పర్యవేక్షించారు.

ఓట్ల లెక్కింపునకు ఏర్పాట్లు పూర్తి

జిల్లా కలెక్టర్ సుమిత్ కుమార్

ప్రజాశక్తి - భీమవరం టౌన్

ఓట్ల లెక్కింపు కోసం తగిన ఏర్పాట్లు చేపట్టడం జరిగిందని, దాదాపు అన్ని ఏర్పాట్లు పూర్తిగా చేపట్టినట్లు జిల్లా కలెక్టర్, జిల్లా ఎన్నికల అధికారి సుమిత్ కుమార్ న్యూఢిల్లీ సీనియర్ డిప్యూటీ ఎలక్షన్ కమిషనర్ నితీష్ వ్యాస్‌కు వివరించారు. బుధవారం న్యూఢిల్లీలోని నిర్వచన్ సదన్ నుంచి సీనియర్ డిప్యూటీ ఎలక్షన్ కమిషనర్ నితీష్ వ్యాస్ సార్వత్రిక ఎన్నికల్లో భాగంగా కౌంటింగ్ సన్నద్ధతపై డిఇఒలు, సిపిలు, ఎస్‌పిలు, తదితరులతో వీడియో కాన్ఫరెన్స్ ద్వారా సమావేశమై భారత ఎన్నికల సంఘం మార్గదర్శకాలను పాటిస్తూ ఓట్ల లెక్కింపు కార్యక్రమాన్ని త్వరితగతిన ఖచ్చితమైన ఫలితాల ప్రకటనకు, శాంతి భద్రతల పరిరక్షణకు నియోజకవర్గాల వారీగా ఇప్పటివరకు చేసిన ఏర్పాట్లను, తీసుకుంటున్న చర్యలను సమీక్షించారు. స్థానిక కలెక్టర్‌లోని వీడియో కాన్ఫరెన్స్ హాల్‌లో జిల్లా కలెక్టర్, జిల్లా ఎన్నికల అధికారి సుమిత్ కుమార్, జిల్లా ఎస్‌పి అజిత వేజెండ్ల, జిల్లా జాయింట్ కలెక్టర్, ఉండి ఆర్ఓ సివి ప్రవీణ్ ఆదిత్య, జిల్లా రెవెన్యూ అధికారి జె.ఉదయ భాస్కరరావు, నియోజకవర్గాల ఆర్ఒలు పాల్గొన్నారు. ఈ సందర్భంగా జిల్లా ఎన్నికల అధికారి మాట్లాడుతూ జిల్లాలో జూన్ 4న చేపట్టనున్న ఎన్నికల కౌంటింగ్ నేపథ్యంలో కౌంటింగ్ సిబ్బందికి శిక్షణా కార్యక్రమాలు పూర్తి చేయడం జరిగిందన్నారు. పోటీలో ఉన్న అభ్యర్థులకు, చీఫ్ ఎలక్షన్ ఏజెంట్లకు కౌంటింగ్ కేంద్రాలను, స్ట్రాంగ్ రూమ్‌లను స్వయంగా చూపించడం జరిగిందన్నారు. కౌంటింగ్ కేంద్రం లోకి కౌంటింగ్ సిబ్బంది, ఎన్నికల కమిషన్ గుర్తింపు కార్డులు జారీ చేసిన వారిని, ఎన్నికల విధుల్లో భాగస్వామ్యం అయ్యే ఎన్నికల సిబ్బంది, అభ్యర్థులను, ఎన్నికల ఏజెంట్స్, కౌంటింగ్ ఏజెంట్స్‌లని మాత్రమే అనుమతించడం జరుగుతుందని అన్నారు. కౌంటింగ్ సిబ్బందికి తొలి ర్యాండమైజేషన్ పూర్తి చేశామని తెలిపారు. ఇప్పటికే రాజకీయ పార్టీలకు, అభ్యర్థులకు, ఏజెంట్స్‌కు అవగాహన కల్పించడం జరిగిందని పేర్కొన్నారు. ఇవిఎమ్, పోస్టల్ బ్యాలెట్, ఇటిపిబిఎస్ ఓట్లు లెక్కింపు అనుగుణంగా చర్యలు తీసుకోవడం జరిగిందన్నారు. జిల్లాలో రెండు చోట్ల కౌంటింగ్ ప్రక్రియ నిర్వహించడం జరుగుతుందని, ఇప్పటికే సుమారు 90 శాతం పనులు పూర్తి చేయడం జరిగిందని తెలిపారు. కౌంటింగ్ ప్రశాంతంగా నిర్వహించడానికి కట్టుదిట్టమైన ఏర్పాట్లు చేసామన్నారు. ఈ వీడియో కాన్ఫరెన్స్‌లో జిల్లా జాయింట్ కలెక్టర్, ఉండి అసెంబ్లీ నియోజకవర్గం రిటర్నింగ్ అధికారి సివి ప్రవీణ్ ఆదిత్య, జిల్లా రెవెన్యూ అధికారి జె.ఉదయభాస్కరరావు పాల్గొన్నారు.



వీడియో కాన్ఫరెన్స్‌లో కలెక్టర్, అధికారులు

విద్యాహక్కు చట్టాన్ని పటిష్టంగా అమలు చేయాలి

ఎస్ఎఫ్ఐ జిల్లా సహాయ కార్యదర్శి శ్రీనివాస్

ఉండి: మండలంలో విద్యాహక్కు చట్టాన్ని పటిష్టంగా అమలు చేసేందుకు అధికారులు చర్యలు చేపట్టాలని ఎస్ఎఫ్ఐ జిల్లా సహాయ కార్యదర్శి శ్రీనివాస్ మండల విద్యాశాఖ అధికారులను కోరారు. బుధవారం మండల విద్యాశాఖ అధికారులను కలిసి వినతి పత్రాన్ని అందజేశారు. ఈ సందర్భంగా శ్రీనివాస్ మాట్లాడుతూ విద్యాహక్కు చట్టం 2009ను అధికారులు పటిష్టంగా అమలు చేయాలని, నిబంధనలకు వ్యతిరేకంగా పనిచేసే ప్రయివేటు, కార్పొరేట్ స్కూల్‌లపై వెంటనే తగిన చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. నిబంధనలకు వ్యతిరేకంగా ముందస్తు అడ్మిషన్లు చేస్తూ పుస్తకాలు, యూనిఫామ్ వారు చెప్పిన దుకాణాలలోనే కొనాలని విద్యార్థుల తల్లిదండ్రులపై ఒత్తిడి తేవడం సరైనది కాదని అన్నారు. ప్రతి ప్రయివేటు, కార్పొరేట్ పాఠశాలలో 25 శాతం సీట్లను నిరుపేదలకు ఉచితంగా కేటాయించాలని నిబంధనలు ఉన్నప్పటికీ వాటిని అమలు చేయడంలో పాఠశాల యాజమాన్యాలు తాత్సారం చేస్తున్నాయన్నారు. విద్యార్థుల సమస్యలపై అధికారులు దృష్టి పెట్టాలని, లేనిపక్షంలో విద్యార్థులు, వారి తల్లిదండ్రులు, తమతో కలిసి వచ్చే ప్రజాసంఘాల నాయకులతో కలిసి పోరాడుతామని శ్రీనివాస్ అధికారులను హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో చందు, గోవింద్ పాల్గొన్నారు.



మండల పరిషత్ కార్యాలయం వద్ద ఆందోళన చేస్తున్న కూలీలు

ఉపాధి కూలీలకు బకాయిలు విడుదల చేయాలి

వ్యకాస రాష్ట్ర ఉపాధ్యక్షులు బండి వెంకటేశ్వరరావు
ఉండి మండల పరిషత్ కార్యాలయం వద్ద నిరసన

ఉండి: ఉపాధి హామీ కూలీలకు వెంటనే బకాయిలు విడుదల చేయాలని ఎపి వ్యవసాయ కార్మిక సంఘం రాష్ట్ర ఉపాధ్యక్షులు బండి వెంకటేశ్వరరావు ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. బుధవారం ఉండి మండల పరిషత్ కార్యాలయం వద్ద జిల్లా అధ్యక్షులు కలిశెట్టి వెంకట్రావు ఆధ్వర్యంలో ఉపాధి కూలీలతో నిరసన తెలిపారు. ఈ కార్యక్రమాన్ని ఉద్దేశించి బండి వెంకటేశ్వరరావు మాట్లాడుతూ 2023-24 సంవత్సరానికి గాను ఉపాధి హామీ పనులు చేసిన కూలీలకు బకాయిలు వెంటనే విడుదల చేయాలన్నారు. మండలంలోని కొంతమంది కూలీలకు 2022లో మరి కొంతమందికి 2023లో కూడా ఉపాధి హామీ బకాయిలు ఉన్నాయని, వాటిని తక్షణం పరిశీలించి వెంటనే విడుదల చేయాలని సూచించారు. ఉపాధి హామీని సక్రమంగా అమలు చేయాలన్నారు. కూలీలకు మజ్జిగ ప్యాకెట్లు, తాగునీరు, ఫస్ట్ ఎయిడ్ కిట్లు, టెంట్లు లేకుండా మండుటెండల్లో ఎటువంటి సౌకర్యాలు కల్పించకుండా పనులు చేయాలని ఉపాధి కూలీలపై టెక్నికల్ అసిస్టెంట్ ఒమేగా రాజు ఒత్తిడి తెస్తున్నారని, ఇదేంటని ప్రశ్నించిన వారిని దుర్భాషలాడుతున్నారని, ఒమేగా రాజుపై శాఖా పరమైన చర్యలు తీసుకోవాలని వారు ఎంపిడిఒ ఎస్.రవీంద్రను కోరారు. అనంతరం వినతి పత్రం అందజేశారు.

కొనసాగిన వేసవి శిక్షణ శిబిరం

నరసాపురం:నరసాపురం ప్రథమ శ్రేణి శాఖ గ్రంథాలయంలో జరుగుతున్న వేసవి శిక్షణా తరగతులు కొనసాగుతున్నాయి. పిల్లల చేత పుస్తక పఠనం, పత్రికా పఠనం చేయించడం జరిగింది. సర్దార్ వల్లబాయ్ పటేల్, భగత్ సింగ్, జవహర్‌లాల్ నెహ్రూ, ఝాన్సీ లక్ష్మీబాయి, మదర్ థెరిస్సా, దేశ నాయకుల జీవిత చరిత్రలు చదివించడం జరిగింది. పొన్నాడ సుబ్రహ్మణ్యం రిటైర్డ్ ప్రిన్సిపల్ వైఎన్ కాలేజ్ రిసోర్స్ పర్సన్‌గా పాల్గొని పిల్లలకు రసాయన శాస్త్ర పరిచయ వాక్యాలు చెప్పారు. ఈ కార్యక్రమంలో సుధీర్ మోహన్, సూర్యం బాబు, ఈద ప్రకాశం, జి.శ్రీనివాస్ పాల్గొన్నారు.

ఉండి: వేసవి విజ్ఞాన శిబిరంలో భాగంగా యండగండి శాఖా గ్రంథాలయంలో బుధవారం డాన్స్ పోటీలు నిర్వహించడం జరిగిందని గ్రంథాలయ అధికారి ఎన్‌సిహెచ్.రామకృష్ణ అన్నారు. ఈ కార్యక్రమంలో వివిధ స్కూల్స్ నుంచి 40 మంది విద్యార్థులు పాల్గొన్నారు. అనంతరం బైర్రాజు ఫౌండేషన్ ఆధ్వర్యంలో యండగండి గ్రామంలోని 1వ తరగతి నుంచి 10వ తరగతి వరకూ చదివే విద్యార్థులకు కంప్యూటర్‌పై అవగాహన, వేదిక్ మ్యాథ్స్, ఫోల్డ్ స్కోప్ వినియోగం వంటి కార్యక్రమాలతో పిల్లల్లో విజ్ఞానం వినోదం అందించడం జరుగుతుందన్నారు. ఈ కార్యక్రమంలో కోపరేటివ్ బ్యాంక్ సెక్రెటరీ సిహెచ్.రవికుమార్ పాల్గొన్నారు.

యాచకులు, పేదలకు ఆహార పొట్లాల పంపిణీ

పాలకొల్లు : స్థానిక మానవత సంస్థ ద్వారా పేదలకు ఆహార పొట్లాలను పంపిణీ చేశారు. ప్రపంచ ఆకలి దినోత్సవాన్ని పురస్కరించుకుని పట్టణంలోని యాచకులకు, పేదలకు ఆహార పొట్లాలను స్థానిక శాఖ ద్వారా అందజేశారు. ఈ సందర్భంగా సంస్థ అధ్యక్షుడు ముత్యాల శ్రీనివాస్ మాట్లాడుతూ 2011లో ఆకలి, పేదరికం అనే వాటిని దూరం చేయటానికి 'ది హంగర్ ప్రాజెక్టు' అనే సంస్థ మే 28న ప్రపంచ ఆకలి దినోత్సవంగా ప్రకటించిందని తెలిపారు. ఆకలిని పారద్రోలడానికి పరిష్కార మార్గాలు కనుగొనే దిశలో ఆహార భద్రత, వ్యవసాయం, కార్యాచరణ వంటివి రూపొందించి అమలు చేయాలని ఈ సందర్భంగా గుర్తు చేశారు. ఈ కార్యక్రమంలో కన్వీనర్ ముత్యాల రామారావు, సభ్యులు శ్రీ వాస్తవ ప్రదీప్ పాల్గొన్నారు.

చదరంగం పోటీలకు విశేష ఆదరణ

నరసాపుర: స్థానిక అల్లూరి సత్యనారాయణ సాంస్కృతిక కేంద్రంలో నూలిసాయి అభయ్ జ్ఞాపకార్థం అభయ చారిటబుల్ ట్రస్ట్ వ్యవస్థాపకులు, బిజిబిఎస్ మహిళా కళాశాల సెక్రటరీ, కరస్పాండెంట్ నూలి శ్రీనివాస్ ఆధ్వర్యంలో నిర్వహించిన చదరంగ పోటీలకు విశేషా ఆదరణ లభించింది. దేశవ్యాప్తంగా పలు రాష్ట్రాల నుంచి సైతం పెద్ద ఎత్తున 524 మంది క్రీడాకారులు తరలివచ్చారు. ఈ పోటీలకు రాష్ట్ర చెస్ అకాడమీ డైరెక్టర్ చంద్రశేఖర్ ఆధ్వర్యంలో జరిగాయి. ఉదయం 10 గంటల నుంచి రాత్రి 7 గంటల వరకూ ఏడు రౌండ్లలో పోటీలు నిర్వహించారు. అనంతరం విజేతలకు నిర్వాహకులు బహుమతులు ప్రదానం చేశారు. ప్రథమ బహుమతి పి.భరత్ కుమార్ రెడ్డి, రెండో బహుమతి ఎన్.సుకనకీర్తన, మూడో బహుమతి కె.సాయి రాజగోపాల్ బహుమతులు అందించారు. విజేతలకు షీల్డ్, మెడల్, సర్టిఫికెట్, నగదు బహుమతులు ప్రదానం చేశారు.

నీటి నిల్వలు మురుగు, అనారోగ్యానికి మూలం

ఆకివీడు:నీటి గుంటల్లో నీరు నిలవ లేకుండా చూసుకోవాలని, నీరు నిల్వ ఉంటే రోగాలకు, దుర్వాసనకు మూలంగా తయారవుతాయని స్వచ్ఛభారత్ మిషన్ నుంచి పరిశీలనకు వచ్చిన కమిటీ సభ్యులు అన్నారు. బుధవారం మండలంలోని సిద్ధాపురం గ్రామంలో ఓడిఎఫ్ ప్లస్ కార్యక్రమంలో భాగంగా ఉండి మండల అధికారి ఎండిఒఎస్.రవీంద్ర, మండల పంచాయతీ విస్తరణ అధికారి ఎం.రామకృష్ణారెడ్డి, ఆర్‌డబ్ల్యుఎస్ ఎఇ కె.శ్రీనివాస్, ఐకెపి ఎపిఎం పి.శివలీల గ్రామంలోని పరిశుభ్రత పారిశుధ్య తదితర అంశాలను పరిశీలించారు. అంగన్వాడీలు ప్రాథమిక పాఠశాలలు, హై స్కూలు, పంచాయతీ భవనాలు, ఇతర ప్రభుత్వ శానిటేషన్ పరిస్థితులను పరిశీలించారు. కార్యక్రమంలో గ్రామ సర్పంచి చిగురుపాటి జయలక్ష్మి, కార్యదర్శి సతీష్ పాల్గొన్నారు.

పోలీసుల కార్డెన్ సెర్చ్

ఆకివీడు: సార్వత్రిక ఎన్నికల ఓట్ల కౌంటింగ్ సందర్భంగా ముందస్తు జాగ్రత్తగా పోలీసులు అనేక కార్యక్రమాలు నిర్వహించారు. వాటిలో భాగంగా రహదారుల వద్ద మోటార్ వాహనాలను క్షుణ్ణంగా పరిశీలిస్తున్నారు. ప్రతి వాహనం తనిఖీ చేస్తున్నారు. మారణాయుధాలు, బాంబులు, ఇతర సామగ్రి వంటి వాటిని నిషేధించినట్లు చెబుతున్నారు. కాగా బాణాసంచా వంటివి కూడా తీసుకువెళ్లొద్దని చెప్తున్నారు. గత 20 రోజులుగా గ్రామ గ్రామాన కార్డెన్ సెర్చ్ నిర్వహిస్తున్నారు. ఎస్ఐ బత్తిన నాగబాబు, సిఐ సత్యనారాయణ పాల్గొన్నారు.

బడి భోజనం ఇంటి వంటలా అనిపించాలి

జిల్లా ఎండిఎం కోఆర్డినేటర్ కె.కృష్ణారావు

పెనుమంట్ర: శుచి, శుభ్రత కలిగి రుచిగా ఉన్న వంటకాలతో బడిలో పెట్టే భోజనం పిల్లలకు ఇంట్లో అమ్మ చేసిన వంటలా అనిపించాలని జిల్లా ఎండిఎం కో ఆర్డినేటర్ కె.కృష్ణారావు అన్నారు. బుధవారం పెనుమంట్ర మండల విద్యా వనరుల కేంద్రంలో జరిగిన మండల ఎండిఎం కార్యకర్తలు, సహాయకులకు నిర్వహించిన ఒక రోజు శిక్షణా కార్యక్రమంలో ఆయన ముఖ్య అతిథిగా పాల్గొన్నారు. 2003 నుంచి అమలవుతున్న ఈ పాఠశాలలో మధ్యాహ్న భోజన పథకం వల్ల పిల్లల చేరికలు బాగా పెరిగాయని అన్నారు. నిరుపేదలు, సామాన్యులైన తల్లిదండ్రులు ఉచితంగా మంచి విద్యతో పాటు పుష్టికరమైన భోజనం తమ పిల్లలకు అందుతుందని భావిస్తున్నారని, అందుకు తగ్గట్టు ఎండిఎం ఉండాలని కోరారు. ఈ శిక్షణా కార్యక్రమంలో ఎంఇఒలు కె.లక్ష్మీ నారాయణ, ఉంగరాల నాగేశ్వరరావు పాల్గొన్నారు.

ఘనంగా ముదునూరి పుట్టినరోజు

నరసాపురం: రాష్ట్ర ప్రభుత్వ చీఫ్ విప్, ఎంఎల్ఎ ముదునూరి ప్రసాదరాజు జన్మదిన వేడుకలు పార్టీ నాయకులు ఘనంగా నిర్వహించారు. పట్టణంలోని వైసిపి కార్యాలయంలో రాష్ట్ర ప్రభుత్వ చీఫ్ విప్ ముదునూరి ప్రసాదరాజు జన్మదిన వేడుకల్లో కేంద్ర పాలకమండలి సభ్యులు పీడీ రాజు కేక్ కట్ చేసి పంచారు.

డ్రెయిన్లు ఆధునికీకరించాలి

భీమవరం టౌన్: రాష్ట్ర ప్రభుత్వం గత 15 సంవత్సరాల నుంచి సాగునీటి కాలువలు, మురుగు నీటి డ్రెయిన్లు ఆధునికీకరించకపోవడం వల్ల రైతులు నష్టపోతున్నారని ఆంధ్రప్రదేశ్ రైతు సంఘం జిల్లా కమిటీ సమావేశం విమర్శించింది. బుధవారం యుటిఎఫ్ కార్యాలయంలో జిల్లా అధ్యక్షులు జుత్తిగ నరసింహమూర్తి అధ్యక్షతన జరిగిన జిల్లా కమిటీ సమావేశంలో రాష్ట్ర రైతు సంఘం సీనియర్ నాయకులు వై.కేశవ రావు హాజరై మాట్లాడారు. అధికారంలోకి వచ్చే ప్రభుత్వం వెంటనే పోలవరం ప్రాజెక్టు పూర్తి చేయడంతో పాటు, జిల్లాలో ఉన్న సాగునీటి కాలువలు, మురుగు కాలువల ప్రక్షాళన తక్షణమే చేపట్టాలని డిమాండ్ చేశారు. ఈ సమావేశంలో యాతం రాంబాబు, కిలారి తవిటి నాయుడు పాల్గొన్నారు. .

మధ్యాహ్న భోజన కార్మికుల సమస్యలు పరిష్కరించాలి

సిఐటియు మండల శాఖ కార్యదర్శి కోడి శ్రీనివాస ప్రసాద్

పెనుమంట్ర : మధ్యాహ్న భోజన పథకం కార్మికుల సమస్యలను ఈ విద్యా సంవత్సరం ప్రారంభం నాటికే పరిష్కరించాలని సిఐటియు పెనుమంట్ర మండల శాఖ కార్యదర్శి కోడి శ్రీనివాస ప్రసాదరావు డిమాండ్ చేశారు. బుధవారం స్థానిక విద్యాశాఖ ఆధ్వర్యంలో పెనుమంట్ర హైస్కూల్లో జరిగిన మధ్యాహ్న భోజన పథకం కార్మికులకు నిర్వహించిన శిక్షణా కార్యక్రమంలో ఆయన మధ్యాహ్న భోజన పథకం కార్మికుల సమస్యలను జిల్లా ఎండిఎం కో ఆర్డినేటర్ కృష్ణారావుకు వివరించారు. వారు తమ డిమాండ్లు ప్రభుత్వానికి పంపుతామని హామీ ఇచ్చారు.

పని దినాలు కల్పించాలి : కలెక్టర్

భీమవరం టౌన్: బుధవారం జిల్లా కలెక్టరేటు వశిష్ట కాన్ఫరెన్స్ హాల్‌లో మహాత్మా గాంధీ జాతీయ గ్రామీణ ఉపాధి హామీ చట్టంలో అమలు చేయబడుతున్న వివిధ పనులు, ఫీల్డ్, ఫీడర్ చానల్స్, చెరువులలో పూడికతీత, హౌసింగ్ 90 దినాలు తదితర పనులపై డ్వామా పీడీ, టెక్నికల్ అసిస్టెంట్లు, ఇసీలు, ఎపిఒలతో జిల్లా కలెక్టరు సమావేశం నిర్వహించారు. మండలాల వారీగా జరుగుతున్న పనులపై సమీక్షించారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ సుమిత్ కుమార్ మాట్లాడుతూ యం-బుక్, తదితర రికార్డులను ఎప్పటికప్పుడు నమోదు చేసి, సమర్థవంతంగా పనులను నిర్వహించాలన్నారు. అర్హత కలిగి ఉపాధి హామీ పనులు అడిగిన ప్రతి ఒక్కరికీ పనిదినాలు కల్పించి, వారికి సకాలంలో నగదు చెల్లించాలన్నారు. పని ప్రదేశాలలో వేతనదారులకు వడదెబ్బకు గురికాకుండా తగు జాగ్రత్త తీసుకోవాలని ఆదేశించారు.

వ్యవసాయ కార్మిక సంఘం నాయకులు డిమాండ్

తాడేపల్లిగూడెం రురల్: ఉపాధి కూలీలకు పూర్తిస్థాయిలో పని కల్పించాలని వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా ఉపాధ్యక్షులు కండెల్లి సోమరాజు డిమాండ్ చేశారు. మండలంలోని నందమురు, ఆరోళ్ల గ్రామంలో ఆయన బుధవారం పర్యటించారు. ఈ సందర్భంగా ఆయన కూలీల సమస్యలు అడిగి తెలుసుకుని మాట్లాడారు. స్థానిక కూలీలకు ఉపాధి పనులు పూర్తి స్థాయిలో కల్పించాలని, వారి జీవనానికి ఉపాధి పనులే దిక్కని ఆవేదన వ్యక్తం చేశారు. ఆయాకట్టుతో పనిలేకుండా కూలీలకు సమగ్రంగా పనులు కల్పించాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో రొక్కం కనకమహాలక్ష్మి, గుండు జనయ్య, సూక్తుల తాతారావు పాల్గొన్నారు.

మధ్యతరగతి విద్యార్థులకు కార్పొరేట్ విద్య..

విజ్ఞాన్ అకాడమీ ఛైర్మన్ ఎన్‌వైవి.సత్యనారాయణ



విజ్ఞాన్ ఇంగ్లీష్ మీడియం హైస్కూల్ భవనం..



ప్రజాశక్తి - ఆకివీడు

ఉన్నత విద్య అందుబాటులో లేని ఎంతోమంది మధ్యతరగతి విద్యార్థుల ఆవేదన తనను ఒకనాడు కదలించిందని ఆ ఆవేదనకు తాను ఇచ్చిన రూపమే విజ్ఞాన్ అకాడమీ ద్వారా విజ్ఞాన్ ఇంగ్లీష్ మీడియం హైస్కూల్ అని అకాడమీ ఛైర్మన్ ఎన్‌వైవి.సత్యనారాయణ అన్నారు. ఆయన ప్రజాశక్తితో మాట్లాడుతూ ఎంతో కష్టతరమైన కార్పొరేట్‌కు మించిన విద్యను మధ్యతరగతి విద్యార్థులకు అతి తక్కువ ఖర్చుతో అందించాలని తాను ఆనాడే నిర్ణయించుకున్నానని ఆ లక్ష్యంతోనే తాను 1989లో ఈ రంగంలోకి అడుగుపెట్టానని చెప్పారు. నాడు ఆరుగురు ఉపాధ్యాయులు, వందమంది విద్యార్థులతో పాఠశాల ప్రారంభించానన్నారు. 34 సంవత్సరాలలో 10వ తరగతికి చెందిన విద్యార్థులు 30 బ్యాచులు ఇప్పటి వరకు బయటకు వెళ్లారన్నారు. అయితే ఏ ఒక్క సంవత్సరం ఒక్క విద్యార్థి కూడా ఫెయిల్ కాలేదని, నూరు శాతం విద్యార్థులు పాసైన ఘనత తమ పాఠశాలకే దక్కిందన్నారు. ప్రస్తుతం పాఠశాలలో 1,350 మంది విద్యార్థులతో 54 మంది ఉపాధ్యాయులు ఉన్నారని చెప్పారు. ఇప్పటి వరకూ తమ పాఠశాల విద్యార్థులు 12 సంవత్సరాలు మండల ప్రథమ స్థానం సాధించారన్నారు. ప్రభుత్వం గ్రేడింగ్ ప్రకటించినప్పుడు 10/10 జిపిఎతో 30 శాతం విద్యార్థులు సాధించారన్నారు. ప్రస్తుతం పూర్తయిన విద్యా సంవత్సరం 2023-24లో చెన్నూరి తనుశ్రీ 587 మార్కులతో మండలంలో ద్వితీయ స్థానం సాధించిందన్నారు. తమ పాఠశాలలో చదువుకుని దొడ్డనపూడికి చెందిన పిట్టక త్రివిక్రమ్ ఐఐటి సీట్ అతి తేలిగ్గా సాధించాడన్నారు. ట్రి పుల్ ఐటీలో తమ పాఠశాల నుంచి 15 మంది విద్యార్థులు సీట్లు సాధించారని చెప్పి, ఏడుగురు విద్యార్థులు వైద్య, విద్యా ఎంబిబిఎస్‌లో సీటు సాధించారన్నారు. చెరుకువాడకు చెందిన శ్రీరమ్యతో పాటు మరికొంత మంది విద్యార్థులు సివిల్ సర్వీసెస్‌లో కూడా స్థానాలు సా ధించారన్నారు. వీరితోపాటు తమ పాఠశాలలో చదువుకుని ఎంతోమంది సివిల్ సర్వీస్‌కు ప్రత్యేక అకాడమీని స్థాపించి ఎందరికో తర్ఫీదునిస్తూ వారిని సివిల్ సర్వీస్ మెట్లు ఎక్కిస్తున్న విశాఖపట్నంకు చెందిన శరత్‌చంద్ర ఐఎఎస్ అకాడమీ మేడిశెట్టి కళ్యాణ్ తమ పాఠశాల విద్యార్థి అని అన్నారు. అంతేకాకుండా అనేకమంది విద్యార్థులు మండల, జిల్లా స్థాయిలోనే కాకుండా రాష్ట్ర స్థాయిలో కూడా కరాటే, భగవద్గీత, పెయింటింగ్ ఆటలు పోటీలలో బహుమతులు సాధించారని చెప్పారు. తమ పాఠశాలలో విద్య అభ్యసించిన వారు జీవితంలో ఎన్నో ఉన్నత విజయాలను సాధించారని, మరింత మంది ఉన్నత స్థితికి ఎదగాలని ఆకాంక్షిస్తున్నామని అన్నారు. స్థానికులందరూ తమకు సహకరిస్తున్నారని సత్యనారాయణ తెలిపారు.

విద్యార్థులను ఉన్నతస్థాయికి చేర్చడమే ధ్యేయం

కింబర్లీ ఇంగ్లీష్ మీడియం యుపి స్కూల్ కరస్పాండెంట్ ఎ.శ్రీసుధ



ప్రజాశక్తి - ఆచంట

నేటి విద్యా ప్రపంచంలో మారుతున్న విధానాలకు అనుగుణంగా పాఠ్యప్రణాళికలు, బోధన విధానాలను రూపొందించి విద్యాభ్యాసం సంపూర్ణంగా, స్వేచ్ఛగా, సమగ్రంగా, ఆనందదాయకంగా అందిస్తుంది కింబర్లీ విద్యాలయ ఇంగ్లీష్ మీడియం యూపి స్కూల్ అని ఆ స్కూల్ కరస్పాండెంట్ ఎ.శ్రీసుధ అన్నారు. ఈ సందర్భంగా ఆమె ప్రజాశక్తితో మాట్లాడుతూ మండలంలోని వల్లూరులో నర్సరీ నుంచి ఏడవ తరగతి వరకూ ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వంచే గుర్తింపు పొందిన ఇంగ్లీష్ మీడియం యూపి స్కూల్ ఇదేనన్నారు. ప్రస్తుత పోటీ ప్రపంచానికి అనుగుణంగా విద్యా బోధన సాగిస్తున్నామని, విద్యార్థుల్లో దాగి ఉన్న ప్రతిభను వెలికితీయడమే తమ లక్ష్యమన్నారు. ఇంగ్లీష్ మీడియం విద్యారంగంలో విశేష అనుభవం కలిగిన యాజమాన్య సారథ్యంలో ఉన్నత ప్రమాణాల సాధనకై కృషి చేస్తున్న మా పాఠశాలలో తమ పిల్లలను చేర్పించి వారి ఉజ్వల భవిష్యత్‌కై బంగారు బాటలు వేయడానికి తమ సహాయ సహకారాలను అందించాలని మనస్ఫూర్తిగా కోరు కుంటున్నానన్నారు. తమ సంస్థను స్థాపించిన అతి తక్కువ కాలంలోనే ప్రజాదరణ పొందుతూ పరిసర గ్రామాల్లోని విద్యార్థులకు నాణ్యమైన విద్యను అందించి, సమాజంలో వారిని విద్యావంతులుగా, ప్రతిభావంతులుగా తీర్చిదిద్ది వారిని జీవితంలో ఉన్నత స్థానాలకు చేరాలనే లక్ష్యంతో ముందుకు వచ్చామన్నారు. విద్యతో పాటు ప్రతి విద్యార్థిలో వినయ, విధేయత, వివేకం, ఆదర్శం, గౌరవం, నైపుణ్యం, దేశభక్తి, క్రమశిక్షణ, నైతిక విలువలను పెంపొందించడం కింబర్లీ విద్యాలయం ద్వారానే సాధ్యమన్నారు. ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం గుర్తింపు పొందిన తమ విద్యాసంస్థలో నర్సరీ నుంచి ఏడవ తరగతి వరకూ అడ్మిషన్లు ప్రారంభించినట్లు శ్రీసుధ తెలిపారు.



వల్లూరులో కింబర్లీ ఇంగ్లీష్ మీడియం స్కూల్..

ప్రత్యేకతలు..

- సొంత భవనంలో తరగతుల నిర్వహణ
- అబాకస్, క్విజ్, ఆటల, పాటలతో ఆహ్లాదకరమైన విద్య
- అనుభవజ్ఞులైన ఉపాధ్యాయులతో విద్యాబోధన
- చక్కని గ్రంథాలయం, ప్రయోగశాల
- స్పోకెన్ ఇంగ్లీష్, కెరియర్ గైడెన్స్‌పై ప్రత్యేక తరగతులు
- ఆధునిక సాంకేతిక పరిజ్ఞానంపై(కంప్యూటర్) శిక్షణ
- ప్రతినెల తల్లిదండ్రులతో సమావేశాలు
- పాఠ్యాంశాల అవగాహనకు డిజిటల్ క్లాస్ రూమ్ సౌలభ్యం
- జవహర్ నవోదయ విద్యాలయ ప్రవేశంకు ప్రత్యేక శిక్షణ
- నిపుణులైన వైద్యులచే పిల్లలకు ఆరోగ్య పరీక్షలు, సూచనలు
- ఎల్‌కెజి నుంచి ఇంటర్ వరకు ట్యూషన్ సదుపాయం కలదు
- వ్యాన్ సదుపాయం కలదు

గ్రామీణ ప్రాంత విద్యార్థులకు విద్యనందించడమే లక్ష్యం

చాణిక్య జూనియర్ కాలేజీ అధ్యక్ష కార్యదర్శులు ముత్యాల వెంకట సత్యనారాయణ, మహమ్మద్ సాదత్ హుస్సేన్



ప్రజాశక్తి - గణపవరం

గ్రామీణ ప్రాంత విద్యార్థులకు నాణ్యమైన విద్యను అందించడమే ధ్యేయంగా చాణిక్య జూనియర్ కాలేజీని గణపవరంలో 1994లో ఏర్పాటు చేసినట్లు కాలేజీ అధ్యక్ష, కార్యదర్శులు ముత్యాల వెంకట సత్యనారాయణ, మహమ్మద్ సాదత్ హుస్సేన్ చెప్పారు. వారు ప్రజాశక్తితో మాట్లాడుతూ 1994వ సంవత్సరంలో కేవలం 23 మందితో ప్రారంభమైన తమ కాలేజీ విద్యార్థుల విద్యాభివృద్ధికి చేస్తున్న కృషిని ప్రభుత్వం గుర్తించి 1997 సంవత్సరంలో ప్రభుత్వం గుర్తింపు వచ్చిందని తెలిపారు. తమ కాలేజీలో విద్యార్థులకు ఎంసెట్ కోచింగ్ ఉచితంగా అందిస్తున్నామన్నారు. ఇంగ్లీష్ విద్య కోసం గ్రామీణ ప్రాంత విద్యార్థులు దూర ప్రాంతాలకు వెళుతున్న తరుణంలో వారికి ఇంగ్లీషు విద్య అందించడం కోసం కాలేజీ ఏర్పాటు చేసామని చెప్పారు. తను కాలేజీకి గణపవరం, నిడమర్రు, ఉండి, ఆకివీడు, ఉంగుటూరు మండలాల నుంచి విద్యార్థులు వస్తున్నట్లు చెప్పారు. వారు రావడం కోసం బస్సులు, ఆటోల సౌకర్యం కల్పించామన్నారు. విద్యార్థులకు క్రమశిక్షణే ధ్యేయంగా అంకితభావంతో తమ సిబ్బంది పని చేస్తున్నట్లు చెప్పారు. విద్యార్థులకు విద్యను అందించడానికి అనుభవం కలిగిన ఉపాధ్యాయులతో శిక్షణ ఇస్తున్నామన్నారు. కాలేజీలో ఐపిఇతో పాటు ఇఎపిసిఇటిపై ఉచితంగా కోచింగ్ ఇవ్వడం వల్ల ప్రముఖ ఇంజనీరింగ్ కాలేజీల్లో తమ విద్యార్థులు సీట్లు పొందుతున్నారని చెప్పారు. గత 28 ఏళ్లుగా ఎందరో విద్యావేత్తలను తయారుచేసి వారికి బంగారు భవిష్యత్తునందించిన గణపవరం ప్రాంతంలో విద్యావ్యాప్తికి కృషిచేస్తుంది చాణిక్య జూనియర్ కాలేజీ మాత్రమేనన్నారు. తక్కువ ఫీజులతో విద్యార్థులకు విద్యను అందిస్తున్నామన్నారు. కాలేజీలో విద్యార్థులకు కావలసిన పూర్తిస్థాయి ల్యాబ్‌లు ఏర్పాటు చేశామని, దీంతోపాటు విద్యార్థులకు క్రీడారంగంపై ఆసక్తి కలిగించడానికి కృషి చేస్తున్నట్లు తెలిపారు. ప్రభుత్వం నుంచి విద్యార్థులకు అమ్మబడి అందుతున్నట్లు తెలిపారు. ప్రభుత్వ నిర్ణయం ప్రకారమే ఫీజు తీసుకుంటున్నామని, పేద విద్యార్థులకు ఫీజుల్లో రాయితీ కల్పించి వారి విద్యాభివృద్ధికి తోడ్పాటు ఇస్తున్నట్లు చెప్పారు. ఈ ఏడాది ఇంటర్మీడియట్ ద్వితీయ సంవత్సర ఫలితాల్లో తమ కాలేజీకి చెందిన కాకర్ల రమాదేవికి 1000 మార్కులకి 986 మార్కులు సాధించి రాష్ట్ర మూడో ర్యాంకు సాధించినట్లు తెలిపారు. అదేవిధంగా కె.సునీత అశ్విని 983, బిఎల్ఎస్.కుమారి 981, కె.శాంతిప్రియ 943 మార్కులు సాధించారని అన్నారు. రానున్న రోజుల్లో కాలేజీ సొంత భవనంలోకి వెళ్లడానికి ప్రయత్నాలు కొనసాగుతున్నాయని చెప్పారు. ప్రస్తుతం అడ్మిషన్లు జరుగుతున్నాయని, విద్యార్థులకు ప్రతివారం అన్ని సబ్జెక్టుల్లో పరీక్షలు నిర్వహిస్తున్నామంటూ తెలిపారు. విద్యార్థుల విద్యా ప్రమాణాలు ఏమాత్రం తగ్గకుండా తమ కృషిని కొనసాగిస్తున్నట్లు చెప్పారు. లాబేపేక్ష కోసం కాకుండా విద్యార్థుల విద్యావ్యాప్తి కోసమే చాణిక్య జూనియర్ కాలేజీ పనిచేస్తుందని తెలిపారు.


కాకర్ల రమాదేవి

రుతుక్రమంపై అవగాహన

ప్రజాశక్తి - గణపవరం

మండలంలోని సిహెచ్ అగ్రహారంలో బుధవారం పిప్పర ప్రాథమిక ఆరోగ్య కేంద్రం సిబ్బంది, అంగన్వాడీ పిప్పర సెక్టార్ సిబ్బంది ఆధ్వర్యంలో 9 సంవత్సరాల నుంచి 19 సంవత్సరాల యుక్త వయసు ఆడపిల్లలకు రుతుక్రమంపై అవగాహన కల్పించారు. ఈ కార్యక్రమంలో పాల్గొన్న ఐసిడిఎస్ పిప్పర సెక్టర్ సూపర్వైజర్ దుర్గాభవాని మాట్లాడుతూ ఆడపిల్లలు రుతుక్రమంలో తీసుకోవాల్సిన జాగ్రత్తలు, శానిటరీ నాప్కిన్స్ వాడే విధానం గురించి అవగాహన కల్పించారు. అనంతరం గ్రామంలో ర్యాలీ నిర్వహించారు. ఈ కార్యక్రమంలో కాశిపాడు ఆరోగ్య సహాయకులు నామాల రాజు, ఎమ్ఎల్‌హెచ్‌పిఆర్.మాధురి, ఎఎన్ఎం ఎం.ఏసమ్మ, అంగన్వాడీ కార్యకర్తలు డి.శ్రీదేవి, ఎస్.సాయమ్మ పాల్గొన్నారు.

ఉండి: మహిళలు రక్తహీనతను అధిగమించాలంటే పౌష్టికాహారం తప్పనిసరిగా తీసుకోవాలని యండగండి ప్రాథమిక ఆరోగ్య కేంద్రం వైద్యులు డాక్టర్ బిన్నీ శామ్యూల్ అన్నారు. బుధవారం మండలంలోని చిలుకూరు, ఎన్‌ఆర్‌పి అగ్రహారం, చెరుకువాడ గ్రామాలలో రుతుక్రమ శుభ్రతపై అవగాహన కార్యక్రమాలను నిర్వహించారు. ఈ కార్యక్రమంలో ఐసిడిఎస్ సూపర్వైజర్ పి.మేరీ పాల్గొన్నారు.

మొగల్తూరు : రుతుక్రమ సమయంలో మహిళలు వ్యక్తిగత పరిశుభ్రత పాటిస్తే ఆరోగ్యంగా ఉండవచ్చని ఐసిడిఎస్ సిడిపిఒ బి.ఊర్మిళ అన్నారు. ఈ సందర్భంగా కిశోర బాలికలకు అవగాహన కార్యక్రమం నిర్వహించారు.

ఉద్యోగాలకు 12 మంది ఎంపిక

ప్రజాశక్తి - పాలకొల్లు

స్థానిక బిఆర్‌ఆర్ అండ్ జికెఆర్ చాంబర్స్ డిగ్రీ అండ్ పిజీ కళాశాలలో బుధవారం సినర్జిన్ కంపెనీ ప్రాంగణ ఎంపికలు నిర్వహించారు. ఈ ప్రాంగణ ఎంపికలకు 57 మంది అభ్యర్థులు హాజరైయ్యారు. 12 మంది అభ్యర్థులను ఎంపిక చేసారని, వీరికి జీతం అలవెన్స్ కలిపి రూ.20 వేలు నెలకు వేతనం ఉంటుందని కళాశాల ప్రిన్సిపల్ డాక్టర్ డి.వెంకటేశ్వరరావు తెలిపారు. ఇంటర్వ్యూల అనంతరం ఎంపికైన విద్యార్థులకు కళాశాల ఛైర్మన్ కెవిఆర్.నరసింహారావు చేతుల మీదుగా ఆఫర్ లెటర్స్ అందించారు. కార్యక్రమంలో కళాశాల ప్లేస్మెంట్ ఇన్‌ఛార్జి కె.లక్ష్మణరావు, కళాశాల ట్రైనర్ కె.సంతోష్ ప్రసాద్ పాల్గొన్నారు.

నరేష్‌కు అవార్డు సముచితం

మదర్ థెరిస్సా హెల్పింగ్ అసోసియేషన్ అధ్యక్షులు కర్రి శ్రీనివాసరెడ్డి

పెనుమంట్ర: నెగ్గిపూడిలోని మదర్ థెరిస్సా హెల్పింగ్ అసోసియేషన్ స్వచ్ఛంద సంస్థ ఉపాధ్యక్షుడు, పెనుమంట్ర మండల విద్యాశాఖ సిఆర్‌పి నక్కా నరేష్ కుమార్‌కి భారతీయ దళిత్ సాహిత్య అకాడమీ ఢిల్లీ వారు డాక్టర్ బిఆర్ అంబేద్కర్ నేషనల్ ఫెలోషిప్ అవార్డుకు ఎంపిక చేయడం సముచితమని ఆ సంస్థ అధ్యక్షులు కర్రి మురళీ శ్రీనివాస రెడ్డి అన్నారు. బుధవారం నెగ్గిపూడిలో అవార్డు గ్రహీత నరేష్ కుమార్‌కు ఢిల్లీ నుంచి సంస్థ పంపిన బంగారు పతకం, ప్రశంసా పత్రాలను అందజేసి, ఘనంగా అభినందన సత్కారం చేశారు. సామాజిక సేవలో, ప్రభుత్వ విద్యాశాఖ సేవలో నిరంతరం ఉండే నరేష్‌కు మరిన్ని గౌరవాలు దక్కాలని అన్నారు. ఈ సందర్భంగా నరేష్ సామాజిక సేవలను పలువురు కొనియాడారు. సమాజ సేవకుడు, డాక్టర్ బొడ్డు విక్టర్ బాబు, సంస్థ వ్యవస్థాపకులు జాతీయ అవార్డు గ్రహీత డాక్టర్ సాకరాజు, డాక్టర్ జితేంద్ర మనో (సౌత్ ఇండియా ఎస్ఇసి) భారతీయ దళిత్ సాహిత్య అకాడమీ-ఢిల్లీ వారికి ప్రత్యేక అభినందనలు తెలిపారు. నరేష్ కుమార్‌కి ఈ అవార్డు రావడం పట్ల విశ్రాంత ఉపాధ్యాయులు పిఎన్‌వి.ప్రసాద్, ఎన్‌కె.నాగేశ్వరరావు, సబ్బితి నందన కుమార్ హర్షం వ్యక్తం చేశారు.

ఎవరెస్ట్‌ను అధిరోహించాలనే అధిరోహకుల కోరిక

భీమవరం టౌన్: హిమాలయాల్లో ఉన్న ప్రపంచంలోనే అత్యంత ఎత్తైన ఎవరెస్ట్ శిఖరాన్ని అధిరోహించాలని దాదాపు ప్రతి అధిరోహకుడి కోరిక లయన్స్ క్లబ్ జోన్ ఛైర్మన్, యూత్ హాస్టల్స్ కార్యదర్శి నందమూరి రాజేష్ అన్నారు. యూత్ హాస్టల్స్, శ్రీవిజ్ఞానవేదిక, లయన్స్ క్లబ్ ఆధ్వర్యంలో మౌంట్ ఎవరెస్ట్ శిఖర దినోత్సవాన్ని భీమవరంలో బుధవారం నిర్వహించారు. ఈ సందర్భంగా రాజేష్ మాట్లాడుతూ 1953లో మొదలైన ఎవరెస్ట్ పర్వతారోహణ నుంచి ఇప్పటి వరకు సుమారు 7 వేల మంది మాత్రమే శిఖరంపైకి చేరుకున్నారని వివరించారు. యూత్ హాస్టల్స్ జిల్లా ఛైర్మన్ డాక్టర్ మట్లపూడి సత్యనారాయణ మాట్లాడుతూ హిమాలయాల్లోని మహలంగూర్ విభాగంలో ఉన్న ఎవరెస్ట్ శిఖరం సముద్ర మట్టానికి 8,848 మీటర్ల ఎత్తులో ఉందని, పర్వతారోహకులు శిఖరాన్ని అధిరోహించేందుకు రెండు మార్గాలు ఉన్నాయని, నేపాల్‌లోని ఆగ్నేయం నుంచి మరొకటి టిబెట్‌లోని ఉత్తరం నుంచి అని, నేపాల్ వైపు నుంచి చాలా మంది ఇష్టపడతారని అన్నారు. నిర్వాహకులు చెరుకువాడ రంగసాయి మాట్లాడుతూ మొదటిగా టెన్సింగ్ నార్కే, హెడ్మెండ్ హిల్లరీలు ఎవరెస్ట్ శిఖరాన్ని అధిరోహించి ప్రపంచ చరిత్ర సృష్టించారని అన్నారు. భీమవరం నుంచి కంచడపు లక్ష్మణ్ ఇటీవలే 570 మీటర్లు ఎక్కారని తెలిపారు. ఈ కార్యక్రమంలో లయన్స్ క్లబ్ పట్టణ ఉపాధ్యక్షులు నరహరి శెట్టికృష్ణ, కళాకారులు ఎస్‌కె చాన్ భాషా పాల్గొన్నారు.

చంద్రబాబును కలిసిన ఎంఎల్ఎ నిమ్మల

పాలకొల్లు: మాజీ ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడును హైదరాబాద్‌లోని ఆయన నివాసంలో పాలకొల్లు ఎంఎల్ఎ నిమ్మల రామానాయుడు బుధవారం కలిశారు. రాష్ట్రంలో ఎన్నికల పోలింగ్ అనంతరం జరిగిన పరిణామాల గురించి వారు చర్చించి, విశ్లేషించారు.

స్వర్ణాంధ్ర పాలిటెక్నిక్‌లో జాబ్ అచీవర్స్ డే

ప్రజాశక్తి - నరసాపురం

మండలంలోని సీతారాంపురం స్వర్ణాంధ్ర కళాశాలలో జాబ్ అచీవర్స్ డే సెలబ్రేషన్స్ ఘనంగా నిర్వహించారు. ఆఖరి సంవత్సరం డిప్లమో విద్యార్థులకు ఇటీవల నిర్వహించిన వివిధ క్యాంపస్ ఇంటర్వ్యూల్లో అత్యుత్తమ ప్రతిభ కనబరిచిన 60 శాతం విద్యార్థులకు ఉద్యోగాలు వచ్చాయని కళాశాల ఛైర్మన్ కెవి.సత్యనారాయణ, కోశాధికారి కెవి స్వామి తెలిపారు. డైరెక్టర్ అడ్డాల శ్రీహరి మాట్లాడుతూ ఈ సంవత్సరం డిసిఎంఇ 270 సీట్లు పెంచామని అన్నారు. ప్రిన్సిపల్ డాక్టర్ కిరణ్మయి మాట్లాడుతూ 18 సంవత్సరాలకే ఉద్యోగం చేయగలిగిన నైపుణ్యం కేవలం పాలిటెక్నిక్ విద్యతోనే సాధ్యమని చెప్పారు. ఈ సంవత్సరం 97 మంది విద్యార్థులకు వివిధ కంపెనీల నుంచి ఆఫర్ లెటర్స్ అందాయన్నారు. ఉద్యోగాలు సాధించిన విద్యార్థులను ప్రిన్సిపల్ డాక్టర్ సురేష్ కుమార్, వివిధ విభాగాధిపతులు అభినందించారు.

నేడు మండల పరిషత్ సమావేశం

ప్రజాశక్తి - గణపవరం

గణపవరం మండల పరిషత్ సమావేశం గురువారం మధ్యాహ్నం రెండు గంటలకు స్థానిక ఎంపిడిఒ కార్యాలయంలో జరుగుతుందని మండల పరిషత్ ఇన్‌ఛార్జి ఎంపిడిఒ కె.సూర్యనారాయణ తెలిపారు. ఈ సమావేశానికి మండల పరిషత్ అధ్యక్షులు దండు వెంకటరామరాజు అధ్యక్షత వహిస్తారని తెలిపారు. ఈ సమావేశానికి ఎంపిటిసిలు, అధికారులు, సర్పంచులు సకాలంలో హాజరుకావాలని కోరారు.

సంకు అప్పారావుకు ఘన నివాళి

తణుకు:స్వాతంత్ర సమరయోధులు, తొలితరం కమ్యూనిస్టు నాయకులు, రాష్ట్ర రైతుసంఘ నాయకులు సంకు అప్పారావు 32వ వర్ధంతి సందర్భంగా తణుకులో ఆయన విగ్రహానికి వామపక్షాల నాయకులు, పురప్రముఖులు పూలమాలలు వేసి ఘనంగా నివాళులర్పించారు. ఈ సందర్భంగా జరిగిన సమావేశంలో దారి దీపం సంపాదకులు డివివిఎస్ వర్మ మాట్లాడుతూ 1937లోనే పార్టీ సభ్యత్వం పొందిన అప్పారావు జిల్లా కమ్యూనిస్టు ఉద్యమానికి పునాదులు వేసిన ప్రముఖులని కొనియాడారు. ఈ సమావేశంలో డాక్టర్ రమేష్, బొద్దాని నాగరాజు పాల్గొన్నారు.

ఎండాకాలంలో ఆరోగ్యాన్ని కాపాడుకోవాలి

ప్రజాశక్తి - పాలకొల్లు

పాలకొల్లు విశ్వమానవ వేదిక వృద్ధాశ్రమంలోని వృద్దులకు 'సనారా ఫౌండేషన్' ఆధ్వర్యంలో నర్సాపురం ప్రభుత్వ వైద్యాధికారి డాక్టర్ శిరిగినీడి సత్యభూషణ్ బుధవారం తమ వైద్యసేవలను అందించారు. ఉచితంగా మందులు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా సత్యభూషణ్ మాట్లాడుతూ ఎండాకాలంలో ఆరోగ్యాన్ని జాగ్రత్తగా సంరక్షించుకోవాలని, మంచినీరు ఎక్కువ తీసుకోవాలని తెలిపారు. ఈ కార్యక్రమంలో రాష్ట్ర మహిళా కమిషన్ మాజీ సభ్యురాలు, జిల్లా తెలుగు మహిళా అధ్యక్షురాలు డాక్టర్ శిరిగినీడి రాజ్యలక్ష్మి పాల్గొన్నారు.

మహారాజశ్రీ భీమవరం సివిల్ జడ్జి (సీనియర్ డివిజన్) వారి కోర్టులో
I.A.No.1422/2022 in O.S.No.92/2022

పిటీషనర్లు /వాద్లు :
శ్రీమతి పెరుమాళ్ళ ఇందు and 2 Others
రెస్పాండెంట్లు/ప్రతివాద్లు :
పెరుమాళ్ళ కొండలరావు and 6 Others
4వ రెస్పాండెంటు /D4 :
పెరుమాళ్ళ వెంకటసాయి, S/o.నాగబాబు, వయస్సు 23 సం॥లు, Pvt. ఎంప్లాయి, డోరునెం.2-1, పెద ఉప్పరగూడెం, H/o.మందపాడు, H/o.ఐ.భీమవరం, ఆకివీడు మండలం, ప.గో.జిల్లా. BJCJC.
7వ రెస్పాండెంటు /D7 :
దిగుమర్తి బాబూరావు, S/o.శామ్యూల్, వయస్సు 42 సం॥లు, వ్యవసాయం, డోరునెం.2-108, ఇంజేటిపేట, దిగమర్రు గ్రామం, పాలకొల్లు మండలం, ప.గో.జిల్లా.

పై నెంబరు I.A.1422/2022కి సంబంధించి అనేక పర్యాయములు శ్రీకోర్టు వారి ద్వారాను మరియు రిజిష్టరు పోస్టు ద్వారా 4,7 రెస్పాండెంట్లు / ప్రతివాదులకు నోటీసులు పంపించినప్పటికిన్నీ సదరు 4,7 రెస్పాండెంట్లు నోటీసులు తీసుకోకుండా ఉద్దేశ్యపూర్వకంగా Avoid చేయుచున్నారు. కావున సదరు 4,7 రెస్పాండెంట్లు / ప్రతివాదుల హాజరు నిమిత్తము ది.**30-06-2024** తేదీకి పై నెంబరు I.A వాయిదా అయివున్నది. కాబట్టి సదరు 4,7 రెస్పాండెంట్లు/ప్రతివాదులు స్వయముగా గాని, వకీలు ద్వారా గాని సదరు తేదీన పైకోర్టు వారి ఎదుట ఉదయం 10.30 ని॥లకు హాజరు కావలెను. లేనియెడల సదరు 4,7 రెస్పాండెంట్లు / ప్రతివాదులు పరోక్షమందు పై నెంబరు I.A తీర్మానించబడును.

భీమవరం 28-05-2024
కె.సోమశేఖర ప్రసాద్
అడ్వకేట్, భీమవరం.

మహారాజశ్రీ భీమవరం సివిల్ జడ్జి (సీనియర్ డివిజన్) వారి కోర్టులో
O.S.No.92/2022

వాద్లు :
శ్రీమతి పెరుమాళ్ళ ఇందు and 2 Others
ప్రతివాద్లు :
పెరుమాళ్ళ కొండలరావు and 6 Others
4వ ప్రతివాది :
పెరుమాళ్ళ వెంకటసాయి, S/o.నాగబాబు, వయస్సు 23 సం॥లు, Pvt. ఎంప్లాయి, డోరునెం.2-1, పెద ఉప్పరగూడెం, H/o.మందపాడు, H/o.ఐ.భీమవరం, ఆకివీడు మండలం, ప.గో.జిల్లా. BJCJC.
7వ ప్రతివాది :
దిగుమర్తి బాబూరావు, S/o.శామ్యూల్, వయస్సు 42 సం॥లు, వ్యవసాయం, డోరునెం.2-108, ఇంజేటిపేట, దిగమర్రు గ్రామం, పాలకొల్లు మండలం, ప.గో.జిల్లా.

పై నెంబరు దావాకు సంబంధించి అనేక పర్యాయములు శ్రీకోర్టు వారి ద్వారాను మరియు రిజిష్టరు పోస్టు ద్వారా 4,7 ప్రతివాదులకు దావా సమన్లు పంపించినప్పటికీ సదరు 4,7 ప్రతివాదులు దావా సమన్లు తీసుకోకుండా ఉద్దేశ్యపూర్వకంగా Avoid చేయుచున్నారు. కావున 4,7 ప్రతివాదులకు హాజరు నిమిత్తము ది.**30-06-2024** తేదీకి పై నెంబరు దావా వాయిదా అయివున్నది. కాబట్టి సదరు 4,7 ప్రతివాదులు స్వయముగా గాని, వకీలు ద్వారా గాని సదరు తేదీన పైకోర్టు వారి ఎదుట ఉదయం 10.30 ని॥లకు హాజరు కావలెను. లేనియెడల సదరు 4,7 ప్రతివాదులు పరోక్షమందు పై నెంబరు దావా తీర్మానించబడును.

భీమవరం 28-05-2024
కె.సోమశేఖర ప్రసాద్
అడ్వకేట్, భీమవరం.